
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 23.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



యుద్ధానికి సై!



28న తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి భారీ బహిరంగ సభ.. చంద్రబాబు-పవన్ హాజరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై యుద్ధం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన తొలి ఉమ్మడి బహిరంగ సభకు వేదిక ఖరారైంది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం జాతీయ రహదారి సమీపంలోని ప్రత్తిపాడులో ఈ నెల 28వ తేదీన నిర్వహించేందుకు విజయవాడలో గురువారం జరిగిన ఉభయపార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో నేతల నిర్ణయించారు. ఈ సభకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. వాస్తవానికి ఉమ్మడి తొలి సభ ఫిబ్రవరి 14న పాలకొల్లు వేదికగా జరగాల్సి వుంది. పొత్తుల భాగస్వామ్యంలోకి బీజేపీ కూడా చేరుతున్న క్రమంలో ఇది వాయిదా పడింది. సభ జరిగే నాటికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులపై పూర్తి స్పష్టత వస్తుందని భీమవరం పర్యటనలో ఇప్పటికే జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టత ఇచ్చారు.

సువిశాల మైదానం

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభకు ప్రత్తిపాడు జాతీయ రహదారికి ఆనుకుని వున్న 25 ఎకరాల ఎన్‌కే గ్రౌండ్స్‌ను ప్రాథమికంగా నిర్ధారించారు. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి దాదాపు ఐదు లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రచిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో పాటు, ఇరు పార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు సభలో పాల్గొంటారు. మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో జిల్లాలో తెలుగుదేశం, జనసేన పార్టీలు అప్రమత్తమయ్యాయి. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ గురువారం తాడేపల్లిగూడెం విచ్చేశారు. స్థానిక తెలుగుదేశం నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, టీడీపీతో సమావేశం అయ్యారు. ఉమ్మడి సభకు ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి భారీగా కార్యకర్తలు, అభి మానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ సభ నుంచే టీడీపీ, జనసేన ఉమ్మడిగా ఎన్ని కల శంఖారావాన్ని పూరించనున్నాయి తెలుగు దేశం-జనసేన పొత్తుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇరు పార్టీల్లోనూ జోష్ నెలకొంది. రెండు జిల్లాల్లో అన్ని స్థానాలు తమ వేనంటూ ఇరు పార్టీల నేతలు ఇప్పటికే కుండ బద్దలు కొడుతున్నారు. జనంలోకి మరింత బలంగా వెళ్లేందుకు ఈ సభ దోహదపడనుందని భావిస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని

వైసీపీని సాగనంపేందుకు.. : పితాని

తాడేపల్లిగూడెం వేదికగా తొలిసారిగా ఉమ్మడి సభ నిర్వహిస్తాయని మాజీ మంత్రి పితాని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా, మైనింగ్, ఇసుక, లిక్కర్ మాఫియాలతో అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ఉమ్మడి రాజకీయ వేదిక దోహదపడుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్‌లు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పురందేశ్వరి, తపనా చౌదరి

27న ఏలూరులో బీజేపీ ప్రజా పోరు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు.. జగన్ వైఫల్యాలను నిలదీస్తాం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):'ప్రజా పోరు పేరిట ఈ నెల 27న ఏలూరులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. ఈ సభకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కానున్నారు. క్లస్టర్‌లోని ఉభయ గోదావరి, ఏలూరు, కాకినాడ, అమలాపురం జిల్లాల పరిధిలోని బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో నేరుగా ఆయన భేటీ అవుతారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రకటించారు. ఏలూరులోని సభా స్థలిని గురువారం పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మిగతా నేతలు పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రజా పోరులో వైసీపీ పాలనలో జరిగే మోసాలను ప్రజల ముందుంచి నిలదీస్తామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ నిలబెట్టుకోలేదని, మద్య నిషేధం అన్నా అదెక్కడా అమలు జరగలేదని, రైతులను ఆదుకునేందుకు 3 వేల కోట్లతో ధర స్థిరీకరణ నిధి ఏర్పాటంటూ వచ్చి అబద్ధాలాడాడని, రైతులను మోసం చేశాడని పురందేశ్వరి విరుచుకుపడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకునేందుకు వీలుగా నాలుగు వేల కోట్లతో విపత్తుల నిర్వహణా నిధి ఏర్పాటు చేస్తామన్నా అదీ జరగలేదన్నారు. రైతుల రక్షణకు బీమాకు రాష్ట్ర వాటా చెల్లించకపోవడం వల్ల అది రైతులకు కాకుండా పోయిందని, దీనికి ప్రధాన కారకులు సీఎం జగన్ అని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శరణాల మాలతీ రాణి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..?

దెందులూరు నియోజకవర్గ కాంగ్రెసు ఇన్‌చార్జి చౌదరి



దెందులూరు, ఫిబ్రవరి 22 : 'వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేసారా..? ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ఎన్నికల నేపథ్యంలో మెగా డీఎస్సీ అని చెప్పి 50 వేల ప్రభుత్వ ఉపాధ్యాయుల పోస్టులకు గాను కేవలం ఆరు వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేస్తున్న జగన్ రెడ్డికి ఇంతభయం ఎందుకు..?' .. అంటూ దెందులూరు కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీఆర్‌కే చౌదరి ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీని నిర్వహించాలని గురువారం ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీసు ముట్టడికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు ఇచ్చిన నేపథ్యంలో దెందులూరు పోలీసులు నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు అనుమతి లేదని చౌదరికి బుధవారం రాత్రి నోటీసులు ఇచ్చి పోతునూరులో హౌస్ అరెస్టు చేశారు. అనంతరం గురువారం ఉదయం దెందులూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి అనంతరం విడిచిపెట్టారు.

పటిష్టంగా పరీక్షల నిర్వహణ : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22 : జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్, డీఎస్సీ, టెట్ పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమ న్వయంతో ప్రశాంత వాతా వరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రసన్న వెంక టేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు తెలిపారు. తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీ డియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్‌గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్‌తో కలసి మంత్రి గురువారం పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షల నిర్వహణపై ఇప్పటికే అధికారులతో సమీక్షించామని తెలిపారు. డీఈవో అబ్రహం, జిల్లా పరీక్షల నిర్వహణ ఏసీ శ్రీకాంత్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రావు, రవాణాశాఖ అధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



రమణీయం.. నారసింహుని కల్యాణం

ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై విరాజిల్లుతున్న లక్ష్మీ నరసింహస్వామి దివ్యకల్యాణోత్సవం కొండ దిగువనున్న కల్యాణ మండపంలో గురువారం ఉదయం వైభవంగా జరిగింది. సుందరగిరి పరిసరాలు భక్తజనుల నృసింహ నామస్మరణలతో మారుమోగాయి. 7

సైకిల్ జోరు

- ఏలూరు పార్లమెంట్‌లో వేగంగా కసరత్తు
- కీలక నియోజకవర్గాల్లో పార్టీ ప్రచారం జోరు
- నూజివీడు, చింతలపూడిలో పూర్తి సర్దుబాటు
- ఇక త్వరలో కైకలూరు, పోలవరం వంతు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికల సమయం దగ్గర పడింది. వ్యక్తులు, పొత్తులు కొనసాగుతూనే వున్నాయి ఒకవైపు తెలుగుదేశం, జనసేన పొత్తు, సమన్వయం, నియోజకవర్గాల ఎంపిక దాదాపు దగ్గరకొచ్చింది. తెలుగుదేశం కొన్ని నియోజక వర్గాల్లో స్థిర అభిప్రాయానికి వచ్చింది. ఇప్పటికే కొన్ని స్థానాల్లో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంకొన్ని పెండింగ్‌లో వుంచారు. జనసేనతో పొత్తు లేదా సర్వే ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరగాల్సి ఉన్నందున ఈ జాప్యం తొంగి చూసింది. చాలాకాలం నుంచి ఇన్‌చార్జి లేని చింతలపూడికి సొంగా రోషన్‌కు అవకాశం ఇచ్చింది. ఎటు తిరిగి రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన పోలవరం, కైకలూరు స్థానాలు సంగతి తేలాల్సి ఉంది. ఈ రెండు స్థానాలపై రెండుమూడు రోజుల్లోనే కీలక ప్రకటన వెలుపడ అవకాశం ఉంది.

అంతటా టెన్షన్ ..

పోటీ చేసే అభ్యర్థుల జాబితా గత ఎన్నికల మాదిరి ఈసారి టీడీపీలో ఆలస్యమైంది. ఆయా నియోజకవర్గాల్లో సమర్థులు, సర్వేల్లో అనుకూలత దగ్గిన వారు, ప్రత్యర్థి పార్టీలు నిర్ధారించిన అభ్యర్థుల కంటే పటిష్ఠ నాయకత్వం వున్న వారికోసం తెలుగుదేశం అన్వేషిస్తోంది. ఉంగుటూరు నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గడిచిన కొన్ని మాసాలుగా ఈ నియోజక వర్గంలో గన్ని ప్రజల మధ్యే ఉంటున్నారు. ఈ మధ్యనే ముఖాముఖికి వీలుగా ఆయా గ్రామాలకు వెళ్లి నాయకులు, క్యాడర్‌తో మమేకమవుతున్నారు. గన్నికి టిక్కెట్ ఖరారైనట్లుగా సమాచారంతో తెలుగుదేశం క్యాడర్‌లో ఊపు వచ్చింది. ఇదే తరుణంలో జనసేనకే ఉంగుటూరు కేటాయిస్తారంటూ మరోవైపు విస్తృత ప్రచారం సాగింది. దీంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు గందరగోళానికి లోనయ్యారు. ఇలాంటి తరుణంలో గన్నికి దాదాపు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ గందరగోళానికి తెరపడినట్లే.

- దెందులూరులో చింతమనేని ప్రభాకర్ గడిచిన కొన్ని మాసాలుగా జనం మధ్యే ఉంటున్నారు. అనేక మందిని పార్టీలో చేరేలా ప్రోత్సహించి అండగా నిలుస్తున్నారు. ప్రభాకర్‌కి తిరుగులేని క్యాడర్, నేతలు ఉండటంతో ఈ మధ్యే జరిగిన చింతలపూడి బహిరంగ సభలోనూ చంద్రబాబు స్వయంగా చింతమనేనికి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారు. మూడు మండలాల్లోనూ ప్రభాకర్ ప్రచార హోరును పెంచడంతోపాటు అధికార వైసీపీకి గట్టి సవాలు విసురుతున్నారు. ఏలూరు నియోజక వర్గంలోనూ పొత్తుల వ్యవహారం చాన్నాళ్లపాటు ఇరు పార్టీలు ఊహాగానాల సుడిలో చిక్కుకుని విలవిలలాడారు. సాధ్యమైనంత మేర స్పష్టత ఇవ్వాలంటూ పార్టీల ఆశావాహులు అధిష్ఠానాలకు విన్నవిస్తూ వచ్చారు. ఈ క్రమంలో టీడీపీ పక్షాన బడేటి చంటికి పార్టీ నుంచి పూర్తిస్థాయి సానుకూలత లభించింది. దీంతో ఆయన ప్రజా సంకల్పయాత్ర పేరిట ఏలూరు నగరంలో వీధి వీధికి వెళ్లి ప్రజలను కలుస్తున్నారు.

ఆ రెండింటా క్లియర్... !

కొద్దిమాసాలుగా తర్జన భర్జనలకు గురైన చింతలపూడి, నూజివీడు నియోజక వర్గాల్లో తెలుగుదేశం అధిష్ఠానం క్యాడర్‌ను సంతృప్తిపరిచేలా నిర్ణయాలు తీసుకుంది. చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. టీడీపీ క్యాడర్‌లో ఉత్సాహం అలుముకుంది. మాదిగ సామాజిక వర్గానికే చాన్నాళ్ల తర్వాత ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు అనువైన నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో పార్టీ కార్యక్రమాలు మరింత శరవేగంగా మారుతాయని భావిస్తున్నారు.

- నూజివీడులో రెండేళ్లుగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నాయకత్వంపై పరస్పర భిన్నాభిప్రాయంతో అక్కడ స్థానిక నేతలున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను వివిధ కారణాలరీత్యా పక్కకు తప్పించి కొలుసు పార్థసారథిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ముద్దరబోయినకు వైసీపీ గేలం వేసి తమ పార్టీలోకి వచ్చేలా వ్యూహం పన్నింది. వైసీపీని వీడిన పార్థసారథిని టీడీపీలోకి తెచ్చుకుని ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం రాజకీయ ఎత్తుగా భావిస్తున్నారు. ఒకే నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు రెండు వ్యూహా ప్రతివ్యూహాలు పన్నడటంతో అభ్యర్థులు ఈ రకంగా తారుమారయ్యారు. అయితే నూజివీడు, చింతలపూడిలో వున్న పాత పరిస్థితులు చక్కబడ్డాయి. ఈ రెండూ స్థానాల్లోనూ గెలుపు తమదేనని టీడీపీ ధీమాతో ఉంది.

కైకలూరు, పోలవరం సంగతేంటో..

ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదింట్లో పార్టీ పరిస్థితులు దాదాపు చక్కబెట్టారు. మిగిలింది పోలవరం, కైకలూరు నియోజక వర్గాలు. ఈ రెండింటిలోనూ సస్పెన్షన్ కొనసాగుతూనే ఉంది.

పోలవరం ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గం కన్వీనరు బొరగం శ్రీనివాసరావు కొన్నాళ్లుగా పార్టీ పటిష్ఠత కోసం పని చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత సమస్యలపై సుదీర్ఘంగా ఆయా కుటుంబాలతో కలిసి అధికార పార్టీపై పోరాడారు. లోతట్టు గిరిజన, గిరిజనేతర గ్రామాల్లోనూ పార్టీ జెండా ఎగిరేలా జాగ్రత్తపడుతూ వచ్చారు. గత ఎన్నికల్లోనూ వున్న పరిస్థితులు పూర్తిగా అధ్యయనం చేసి ఈ ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసే క్యాడర్‌ను ప్రోత్సహిస్తూ ఈ సారి ఇదే నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తారని చాలాకాలంగా దూమారం రేగుతోంది. దీంతో ఇటు టీడీపీలో కాస్త గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చివరి క్షణాల్లో మార్పులు చేర్పులు జరిగి తమ నేత బొరగానికే టీడీపీ టిక్కెట్ ఛాన్స్ ఇస్తుందనే నమ్మకంతో పార్టీ క్యాడర్ ఉంది.

- కైకలూరులో జయమంగళ వెంకటరమణ టీడీపీని వీడి వైసీపీలో చేరిన నాటి నుంచి ప్రత్యేకించి ఇన్‌చార్జి బాధ్యతలను టీడీపీ ఎవరికి అప్పగించలేదు. వాస్తవానికి ఈ స్థానం నుంచి పలువురు టీడీపీ ఆశావాహులు పోటీకి సిద్ధంగా వున్నారు. పెన్మెత్స వెంకటేశ్వరరాజు పోటీ పడుతూ వచ్చారు. కైకలూరు స్థానం నుంచి తనకు అవకాశం ఇస్తే గెలిచి తీరుతానని నమ్మకంతో వున్నారు. అయితే భారతీయ జనతా పార్టీతో ఎన్నికల పొత్తు గురించి మార్పులు చేర్పులు అనివార్యమవుతాయని కాబట్టి ఈ స్థానాన్ని టీడీపీ ప్రస్తుతానికి రిజర్వుడు చేసినట్టు చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఒకట్రెండు రోజుల్లోనే టీడీపీ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

రోగాలు ఇక్కడ.. కార్యాలయం అక్కడా..?



కేఆర్ పురంలోని జిల్లా మలేరియా కార్యాలయం

- 30 ఏళ్ల పోరాటానికి.. 3 గంటల్లో ముగింపు!
- మలేరియా కార్యాలయం ఏలూరుకు తరలింపుపై ఆదివాసీల ఆగ్రహం
- తక్షణమే వెనక్కి తీసుకురావాలని డిమాండ్
- ఆందోళనలకు సిద్ధపడుతున్న గిరిజనులు
- మలేరియా కార్యాలయాన్ని వెనక్కి తరలించాలని పీవో కలెక్టర్, కమిషనర్‌కు లేఖలు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 22 : ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ కేంద్రంగా పనిచేస్తున్న జిల్లా మలేరియా కార్యాలయాన్ని జిల్లా కేంద్రం ఏలూరుకు తరలించడంపై పశ్చిమ ఏజెన్సీ మన్యం ప్రాంతంలోని ఆదివాసీ బిడ్డలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 30 ఏళ్ల పాటు నిరంతర పోరాటం చేసి ఏజెన్సీ ప్రాంతానికి సాధించుకున్న కార్యాలయాన్ని కేవలం మూడు గంటల వ్యవధిలో మొత్తం ఖాళీ చేసి సామగ్రిని, ఫైళ్లను ఏలూరుకు ఎలా తరలిస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో జిల్లా మలేరియా కార్యాలయం జిల్లా కేంద్రంలోనే ఉండాలన్న ప్రభుత్వం జీవోతో ఆగ మేఘాలపై అప్పట్లోనే ఏలూరుకు తరలించారు. ఈ తరలింపులో ఏజెన్సీలో ఉద్యోగం చేయడం ఇష్టపడని కొందరు ఉద్యోగుల అత్యు త్సాహం ఉందనే విమర్శలున్నాయి. ఏలూరుకు తరలించిన మలేరియా కార్యాలయాన్ని కేఆర్‌పురంలోనే ఉంచాలని లేదంటే ఆందోళనలకు దిగుతామని గిరిజనులు హెచ్చరిస్తున్నారు. రోగాలు వచ్చే ప్రాంతంలో కార్యాలయాన్ని ఉంచకుండా వేరే ప్రాంతంలో ఉండడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం జిల్లా కార్యాలయం కేఆర్‌పురంలో ఉంది. అయితే వాస్తవానికి ఇక్కడి కార్యాలయాన్ని కేవలం మందుల గొడౌన్‌గా మార్చిన ఘనత అధికారులకు, ప్రభుత్వానికి దక్కుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు జిల్లా కేంద్రంలోనే ఉండే మలేరియా కార్యాలయాన్ని ఏజెన్సీకి రప్పించడానికి గిరిజనులు ఏళ్ల తరబడి పోరాటాలు చేశారు. అప్పట్లో మలేరియా విజృంభించి మరణాలు సంభవిస్తే నాలుగైదు రోజులకు మలేరియా అధికారులు, సిబ్బంది ఏజెన్సీ ప్రాంతాలకు వచ్చి శాంపిల్స్ సేకరించి నివారణ చర్యలు చేపట్టేవారు. మలేరియా అధికంగా ఉన్న ఏజెన్సీలోనే కార్యాలయాన్ని పెట్టాలని ఆందోళనలు ఉధృతం కావడంతో అధికారులు పదేళ్ల కిందట కేఆర్ పురానికి తరలించారు. ఏజెన్సీలోని ఐదు గిరిజన మండలాల్లో 402 రెవెన్యూ గ్రామాలు ఉండగా అధికారుల లెక్కలు ప్రకారం 182 మలేరియా సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. వీటిలో 50 నుంచి 70 వరకు అత్యంత సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్టు అధికారులు గుర్తించి ఎప్పటికప్పుడు మలేరియా ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. గతేడాది 152 మలేరియా కేసులు నమోదు కాగా 2024 జనవరి నుంచి ఇప్పటివరకు మూడు కేసులు నమోదైనట్టు ఇన్‌చార్జి మలేరియా అధికారి జె.సురేష్‌కుమార్ తెలిపారు.

ఇటీవలే మలేరియా కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అసలు విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు. కార్యాలయం తరలింపు విషయాన్ని తనకు తెలియపర్చక పోవడం పట్ల విస్మయం, ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన పీవో మలేరియా కార్యాలయం ఏజెన్సీలోనే ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఏలూరు నుంచి కార్యాలయాన్ని కేఆర్ పురం తిరిగి తరలించాలంటూ కలెక్టరుకు, ట్రైబల్ కమిషనర్‌కు నివేదికలు పంపారు. పీవో నివేదికలపై కలెక్టర్, కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు సమాచారం

ఏజెన్సీలోనే ఉంచాలి



ఏజెన్సీలో మలేరియాను నివారించడానికి కార్యాలయాన్ని ఇక్కడే ఉంచాలి. జిల్లా కార్యాలయాలు జిల్లా కేంద్రంలోనే ఉండాలన్న కారణంతో ఐటీడీఏ కార్యాలయాన్ని కూడా ఏలూరుకు తరలిస్తారా?. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించాలి.

– ధర్మల సురేష్ ఏఐకేఎంఎస్ నాయకుడు

ఆందోళనకు సిద్ధం



మలేరియా కార్యాలయాన్ని వెనక్కి తరలించకుంటే గిరిజన, ఆదివాసీ, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన చేపడతాం. కార్యాలయం ఇక్కడ ఉంటేనే వైద్యసేవలు అందడం అంతంతమాత్రంగా ఉంటుంది. కార్యా లయం తరలింపును ఎట్టి పరిస్థితిలో అంగీకరించం.

– కారం రాఘవ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు

జిల్లాలో రూ.47.40 లక్షలతో ..

వేసవి మంచినీటి ప్రణాళిక సిద్ధం

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 22 : ఈ ఏడాది గతంతో పోలిస్తే ఎండలు తీవ్రంగానే ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో మంచినీటి ఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. మంచినీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ముందస్తుగా వేసవి మంచినీటి ప్రణాళికను రూపొందించారు. జిల్లాలో మంచినీటి ఎద్దడి ఏర్పడే 18 మండలాల్లో రూ.47.40 లక్షలతో వేసవి మంచినీటి ప్రణాళిక (సమ్మర్ యాక్షన్‌ప్లాన్)ను సిద్ధం చేశారు. మార్చిలో రూ.20 లక్షలు, ఏప్రిల్‌లో రూ.27.40 లక్షలు ఖర్చు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో 18 మండలాల్లోని 56 హేబిటేషన్ల పరిధిలో మంచినీటి ఎద్దడి తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఈ ప్రణాళిక రూపకల్పన చేశారు. పది హేబిటేషన్ల పరిధిలో 17 హెయిరింగ్ వనరులను ఉపయోగించుకుని మంచినీటిని సరఫరా చేసేందుకు రూ. 2.04 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. జిల్లాలోని 11 మండలాల్లో 122 ప్రాంతాల్లో బోర్‌వెల్స్‌లో పూడిక తీయడానికి రూ. 12.35 లక్షలు ఖర్చు అవుతాయని, ఏడు మండలాల్లోని 14 ప్రాంతాల్లో ఎస్ఎస్ ట్యాంక్‌లలో నీరు నింపడానికి రూ.33 లక్షలు ఖర్చు అవుతాయని ఈ ప్రణాళికలో అంచనా వేశారు. జిల్లాలో సీపీడబ్ల్యూ స్కీమ్‌లు 21, పీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 1,269, ఎంపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 4,66, చేతిపంపులు 4,390, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌లు 7,24 వరకు ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఎస్ఎస్ ట్యాంక్‌లు 236లో నీరు నింపాల్సి ఉండగా ఇప్పటికే 26 చోట్ల 90 శాతం వరకు, 128 చోట్ల 75 నుంచి 90 శాతం వరకు, 72 చోట్ల 50 నుంచి 75 శాతం వరకు, 8 చోట్ల 25 నుంచి 50 శాతం వరకు, 2 చోట్ల 25 శాతం లోపు వరకు నీరు నింపే కార్యక్రమం పూర్తయింది. మిగిలిన ప్రాంతాల్లో నీరు నింపే కార్యక్రమం కొనసాగుతోంది. 'వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు మంచినీటి ప్రణాళిక సిద్ధం చేశాం. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు క్రాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మంచినీటి వనరులను పరిశీలించి లోపాలు ఉంటే సరిచేస్తున్నాం. గ్రామాల్లో చేతిపంపులు, తాగునీటి పథకాలను పరిశీలించి మరమ్మతులు చేయడానికి స్థానిక నిధులను వినియోగిస్తాం..' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ వివరించారు.

రేపు హైకోర్టు న్యాయమూర్తులు రాక

నరసాపురం, ఫిబ్రవరి 22: కోర్టు ప్రాంగణంలో శనివారం సీనియర్ న్యాయవాది స్వర్గీయ అందే బావన్న చిత్రపట ఆవిష్కరణకు ఐదుగురు హైకోర్టు న్యాయమూర్తులు విచ్చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా దానయ్యనాయుడు, ఆర్కె బాబ్జీలు తెలిపారు. ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ జడ్జి ఆకులవెంకటస్వామి, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ జయసూర్య, జస్టిస్ మల్లిఖార్జున రావు, జస్టిస్ హరినాథ్‌లు హాజరవుతున్నారన్నారు. వీరితో పాటు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులు డీఎస్ఆర్ వర్మ, సోమయాజులు, భవానిప్రసాద్‌లు కూడా విచ్చేస్తున్నట్లు తెలిపారు.

జనసేనలో చేరుతున్నా

నా తమ్ముడు కూడా నా వెంటే : మాజీ మంత్రి కొత్తపల్లి



విలేకర్లతో మాట్లాడుతున్న కొత్తపల్లి

నరసాపురం, ఫిబ్రవరి 22: గత కొంతకాలంగా కొత్తపల్లి సుబ్బా రాయుడు పార్టీలో చేరి కపై వస్తున్న ఊహాగానాలకు గురువారం ఆయన క్లారిటీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన సోదరుడు జానకీరామ్ కూడా జనసేనలో చేరుతారన్నారు. ఈ నెలాఖరులోపు పవన్ సమక్షంలోనే తన మద్దతుదారులతో కలిసి పార్టీ కండువాను కప్పుకోనున్నట్లు స్పష్టం చేశారు. గుత్తుల బలిచక్రవర్తి, వైఎస్ బాబులు, మురళీ, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం/ఉంగుటూరు, ఫిబ్రవరి 22: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజును అసభ్య పదజాలంతో దూషించడమే గాక సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి అవమానిస్తున్న పులివెందులకు చెందిన రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మండలంలోని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ నాయకులు స్టేషన్‌కు వచ్చి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, చింతల వెంకటరమణ, నల్లారి గోపి, దుర్గాప్రసాద్, సిద్దూ, సంకట రమేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చావల చినబాబు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకట్రావు ఉన్నారు. ఉంగుటూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం, నాయకులు దిడ్ల శ్రీనివాసరావు, ఉప్పాటి పుల్లారావు తదితరులు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్‌నాయక్

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 22 : దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి అని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ సురేష్‌నాయక్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఇన్నో వేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డవలప్ మెంట్ అనే అంశం పై గురువారం ఏపీ నిట్ ప్రాంగణంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి అధ్యక్షత వహించగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ దేశ ప్రగతి లో పరిశోధన, అభివృద్ధి పాత్ర ఎంతో కీలకమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలను విద్యార్థులందరూ ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలన్నారు. శాస్త్రవేత్తలు ఒక వైజ్ఞానిక పరిశోధన కోసం ప్రయోగ శాలలో ఏళ్ళ తరబడి అంకిత భావంతో కృషి చేస్తారన్నారు. భారత దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త జగదీష్‌చంద్రబోస్ తన పరిశోధనలతో ఎంతో కీర్తిని గడించారని, అటు వంటి వారి స్ఫూర్తితో విద్యార్థులు విభిన్నంగా ఆలోచిస్తూ కొత్త పరిశోధనలను విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వీసందీప్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, డాక్టర్ సంతోష్, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ సుదర్శన దీపలు పాల్గొన్నారు.

ఈ..సమస్యకి పరిష్కారం లేదా ?

తరచూ సర్వర్ డౌన్.. నిలిచిపోతున్న రిజిస్ట్రేషన్‌లు




రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్యాష్ డేటా చూపని దృశ్యం

ఆచంట, ఫిబ్రవరి 22: రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా తీసుకువచ్చిన 2.0 విధానంతో ప్రతీ రోజూ ఏదో ఒక సమస్య తలెత్తు తూనే ఉంది. రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరగడానికి వీలు లేకుండా ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. దీంతో కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి గంటల కొద్దీ వేచి ఉన్నప్పటికి ఒక్కసారి సర్వర్ సమస్య తలెత్తడంతో కక్షిదారులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. గురువారం దస్తావేజులకు సంబంధించి ఈకేవైసీలు అయినప్పటికి క్యాష్ రిసిప్ట్‌లో దానికి సంబంధించి డేటా రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్య అలాగే ఉండిపోవడంతో జిల్లాలో ఎక్కడా కూడా రిజిస్ట్రేషన్‌లు జరగ లేదని సమాచారం. ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కక్షిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలానా రూపంలో డబ్బులు కడుతున్నామని ఆ డబ్బులు వెంటనే ప్రభుత్వ అకౌంటుకు వెళ్ళిపోతున్నాయని అంటు న్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌లు విషయంలో అనేక నిబంధనలు పెట్టిన కారణంగానే కక్షిదారులు అవస్థలు పడుతూనే ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేలా చూడాలని కక్షిదారులు కోరుతున్నారు.

తాళ్ళపూడి మండలంలో పులి సంచారం

రంగంలోకి శ్రీశైలం టైగర్ రిజర్వు అటవీశాఖ బృందం



పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం, ఫిబ్రవరి 22 : రెండు నెలలుగా ఏజెన్సీ పరిసర ప్రజానీకానికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి గురువారం తాళ్ళపూడి మండలానికి చేరుకుంది. బుధవారం దేవరపల్లి మండలంలో అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీ పరిసరాల్లో పులి సంచారంపై అటవీశాఖ అధికా రులకు సమాచారం అందడంతో ఆ ప్రాంతానికి వెళ్ళి పాదముద్రలు పరిశీలిం చారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా తాళ్ళపూడి మండలం మల కపల్లి గ్రామంలో వరి పొలాల్లో పులి పాద ముద్రలు గుర్తించినట్లుగా రైతులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు శ్రీశైలం టైగర్ రిజర్వు అడవుల్లో పని చేసిన ప్రత్యేక బృందంతో పరిశీలించారు. పులి గమనంపై దృష్టి సారించి పులిని అనుసరించే దిశగా చర్యలు చేపట్టినట్లు అటవీక్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. తాళ్ళపూడి మండలంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, రావూరుపాడు, మలకపల్లి, వెంకటాయపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పులి సంచరించే ప్రాంతాల్లో పశువు లను మేపడం, కట్టడం చేయరాదని, పులి ఆనవాళ్ళు కనిపిస్తే అటవీ అధికా రులకు సమాచారమివ్వాలన్నారు పులి సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 180042 55909 లేదా ఏలూరు అటవీక్షేత్రాధికారి నంబర్94408 10222కు తెలిపాలని కోరారు.





పాలకొల్లులో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఐక్యత చాటుతున్న జర్నలిస్టులు ...నరసాపురంలో డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

సంఘటితంగా పోరాడాలి

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో సభ్యులు

జర్నలిస్టులపై దాడులకు నిరసన

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి, 22 : పాత్రికేయులపై దాడులను పాత్రికే యులందరూ సంఘటితంగా ప్రతిఘటించాలని ఏపీయూడబ్ల్యూజే పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విసాయిబాబా, గజపతి వరప్రసాదులు కోరారు. పాలకొల్లులో గురువారం పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ దాడులకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీనెలా జిల్లా కార్యవర్గ సమావేశంలో నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించాలని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌లు ఇవ్వాలని. ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని, విద్యా రాయితీ ఉత్తర్వులు ఇవ్వాలని, కమిటీ తరుపున సభ్యులందరికీ ఐడి కార్డులు ఇవ్వాలని, ఆఫీసు భవనం నిర్మాణానికి ప్రయత్నం చేయాలని తీర్మానించారు. జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా భాస్కరరావు, జిల్లా చిన్నపత్రికల అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం, ఫిబ్రవరి 22: ఇటీవల రాష్ట్రంలో పలు చోట్ల జర్నలిస్టులపై జరిగిన దాడుల్ని నిరసిస్తూ గురువారం నరసాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందించారు. అక్కడ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేశారు. డీఎస్పీ మనోహరాచారికి వినతిపత్రం ఇచ్చారు. అధ్యక్షుడు ఇజ్రాయిల్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలన్నారు. కుమార్, రంగ, చిన్నారావు, సూర్యనారాయణ, రాజేష్, బాబు, రాంబాబు, ఆనందరాజు, రాము, వెంకటేశ్వరావు, శ్రీను, భగవన్, సందీప్, సత్యనారాయణ, పండు, బాబీ, దివిసత్యన్, నాని, రమేష్, రాజు, శంకర్, బాలజీ తదితరులు పాల్గొన్నారు.





స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు...పట్టు వస్త్రాలను తెస్తున్న మంత్రి వనిత, ట్రస్టీ

రమణీయం..నారసింహుని కల్యాణం

భక్తజనసంద్రంగా సుందరగిరి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22: మహిమాన్వితుడిగా సుందరగిరిపై విరాజిల్లుతోన్న లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవం కొండ దిగువనున్న కల్యాణమండపంలో గురువారం ఉదయం వైభవంగా జరిగింది. సుందరగిరి పరిసరాలు భక్తజనుల నృసింహ నామస్మరణలతో మారుమోగాయి. చిన వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని ఈ ఆలయంలో ముందుగా కనకవల్లీ సమేత లక్ష్మి అమ్మవారితో నరసింహుని ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి కొండదిగువనున్న కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటిబోదెలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై ఉన్న సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. హోంమంత్రి తానేటి వనిత, ట్రస్టీ ఎస్‌వీ నివృతరావు, ఈవో వేంద్ర త్రినాధరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శుభముహూర్త సమయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింప చేశారు. పండితుల వేద మంత్రోచ్చరణలు, భక్తుల నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

వైభవంగా పండిత సదస్యం



అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యా ణోత్సవాల్లో భాగంగా ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి సారధ్యంలో వేదాశీర్వచనం చేశారు. గురువారం సాయంత్రం హనుమద్వాహనంపై, రాత్రి సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామివారి చక్ర స్నానానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ తెలిపారు. ఆలయ ఛైర్మన్ కలిదిండి కుమార రామగోపాల రాజా బహుదూర్, రాంబాబు, ఎస్ఐ రాము, దాసరి వాసు పాల్గొన్నారు.

మిలటరీ మాధవరంలో వరుణ్‌తేజ్ సందడి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: హీరో వరుణ్‌తేజ్ తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరంలో గురువారం సందడి చేశారు. ఆయన నటించిన ఆపరేషన్ వాలంటైన్ చిత్రం ప్రమోషన్ కోసం వచ్చిన వరుణ్ మాట్లాడుతూ ఈ గ్రామంలో దేశరక్షణ కోసం ప్రతీ ఇంటి నుంచి కనీసం ఒకరు పనిచేయడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించిందని తాను నటించిన ఈ చిత్రం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బ్యాగ్రౌండ్‌గా తెరకెక్కిందన్నారు. అనంతరం దేశ రక్షణలో గ్రామంలో అమరులైన వారి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన అమర వీరుల స్థూపం వద్దకు చేరుకుని సెల్యూట్ చేశారు.



అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న వరుణ్

క్రైం కార్నర్

ఆరు సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు స్వాధీనం



భీమవరం క్రైం, ఫిబ్రవరి 22 : భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్‌లో నిర్వహిస్తున్న గోపి పికెల్స్‌లో గురువారం తనిఖీ చేయగా ఆరు గృహ అవ సరాల గ్యాస్ (సబ్సిడీ గ్యాస్) సిలెండర్లును గుర్తించినట్లు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ తెలిపారు. తనిఖీలో రూ.16,002 విలువ కలిగిన ఆరు సిలెం డర్లు సీజ్ చేసి యజమాని నాగరాజుపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రీజనల్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి కరణం కుమార్‌కి అందిన సమాచారం మేరకు ఆయన ఆదే శాలతో దాడుల చేసినట్టు తెలిపారు.సీఎస్ ఆర్ఐ సురేష్, సిబ్బంది తెలిపారు.

బంగారం చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 22 : బంగారం చోరీపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొనకళ్ళ అచ్యుతరావు తన ఇంటిలో సూట్ కేసులో పెట్టిన 6 కాసుల బంగారపు హారం ఈనెల 12వ తేదీన కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తిపై అనుమానంతో ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 22 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బండివారిగూడెం గ్రామ శివార్లలో గల ఎర్రకాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో గురువారం దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

60 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం, ఫిబ్రవరి 22 :పోలవరం మండలం పాత తోటగొంది గ్రామంలో గురువారం సారాతో తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలవరం పోలీస్ స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపారు. మడకం రమేశ్ పాతతోటగొంది గ్రామం నుంచి 60 లీటర్ల సారా రవాణా చేస్తుండగా అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకి పంపినట్లు తెలిపారు.

52 మద్యం బాటిళ్లు స్వాధీనం



పాలకోడేరు, ఫిబ్రవరి 22 : పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్ ఆదేశాలతో మల్లుల వీరాస్వామిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐతో పాటు సిబ్బంది హజరయ్య, నాగరాజు, దుర్గారావు, భావానిలను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు

పెదపాడు, ఫిబ్రవరి 22 :రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఆ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన కాజా అప్పారావు (42) కూలి పనులతో పాటుగా ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏలూరులో ఫ్లవర్ డెకరేషన్ చేసి కుమారుడు రామ్మోహన్‌తో కలిసి మోటారుసైకిల్‌పై పెదపాడు వస్తుండగా కొత్తూరు సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వీరి మోటారుసైకిల్‌తో పాటుగా మరో మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనలో అప్పారావుకు తీవ్రగాయాలవగా కుమారుడు రామ్మోహన్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పారావు మృతి చెందాడు. గాయాలపాలైన వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రామ్మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ కోసం విచారిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

భార్య కేసు పెట్టిందని మనస్థాపంతో ఆత్మహత్య

పెనుగొండ, ఫిబ్రవరి 22: భార్య కేసు పెట్టడంతో మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం పెనుగొండ మండలం దొంగరావి పాలెంకు చెందిన కుడిపూడి వెంకటేష్ (34) అదే గ్రామానికి చెందిన జీవనితో పదేళ్ళ క్రితం వివాహ మైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటేష్ జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. 6 నెలల క్రితం వీరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో సర్దుబాటు చేశారు. గొడవలు సద్దుమణగకపోవడంతో నెల క్రితం జీవని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె భర్తతో పాటు మరో ఇద్దరిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. దొంగరావిపాలెం వచ్చిన వెంకటేష్ మనస్తాపానికి గురై ఈ నెల 19న శానిటైజర్ తాగాడు. బంధువులు వైద్యం నిమిత్తం తణుకు ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రామారెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి డ్రైవర్ మృతి

భీమడోలు,ఫిబ్రవరి 22 : ఆర్థిక సమస్యలు తట్టుకోలేక లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యకి పురుగుమందు తాగడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం భీమడోలు గ్రామానికి చెందిన కోపల్లి కుసుయ హరనాధ వెంకట రాజు (63) ఈనెల 17న కలుపు మందు తాగడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు భార్య లూపారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : కొంతమంది తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ తీవ్ర మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకున్న వ్యక్తి తీవ్ర గాయాలకు గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరులోని కొమడవోలుకు చెందిన చలపారెడ్డి మురళీ (45) గతంలో ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ వద్ద హోటల్ నిర్వహించే వాడు. ప్రస్తుతం ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. మద్యం తాగి ఆటో నడపడంతో ఆటో యూనియన్ వారు మందలించారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దంటూ హెచ్చరించి 15 రోజుల పాటు ఆటో నడపవద్దని ఆదేశించారు.దీంతో ఆశ్రం సెంటర్‌లో తిరిగి హోటల్ పెట్టుకోవడానికి ప్రయత్నించగా కొంతమంది ఆటోడ్రైవర్లు ఆ స్థలంలో ఆటోస్టాండ్ అనిబోర్డు పెట్టడంతో మనస్థాపానికి గురై ఈనెల 13న అక్కడే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నించేవారంటే జగన్‌కు భయం : తోట సీతారామలక్ష్మి



భీమవరం అర్బన్, ఫిబ్రవరి 22: ప్రశ్నించే గళం వింటే జగన్ వణుకు పోతున్నారని పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మండిపడ్డారు. జగన్ పాలనలో మోసాలను, అవినీతిని వెలికి తీస్తున్న వార్తా పత్రికలు, న్యూస్ ఛానల్స్ జర్నలిస్టులపై జగన్ తన రౌడీ మూకలతో దాడి చేయడం సిగ్గుచేటన్నారు. సిద్ధం సభలో చొక్కాలు మడతపెట్టే పనిలో ఉండండని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం వల్లనే దాడులకు తెగబడుతున్నారన్నారు.



తప్పుల్ని ఎత్తిచూపితే దాడులా : బండారు

నరసాపురం, ఫిబ్రవరి 22: తప్పుల్ని ఎత్తిచూపితే ప్రభుత్వం తట్టుకోలేక విలే కర్లపై దాడులు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మండిపడ్డారు. జర్నలిస్టులు, మీడియా కార్యాలయాలపై వైసీపీ దాడుల్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం నిరంకుశ తత్వానికి ఈ దాడులే నిదర్శమన్నారు. సత్యనారాయణరాజు, కొండేటి శ్రీను,చాగంటి సురేష్, నరేంద్ర, హేమ, శేఖర్, నాగరాజులు పాల్గొన్నారు

పిరికిపంద చర్య : జనసేన

కుక్కునూరు, ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై దాడి పిరికిపంద చర్యని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యుగంధర్ అన్నారు.జగన్ పాలనలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని అరాచకం రాజ్యమేలుతోందన్నారు. ఎం.వెంకన్న బాబు, మంత్రి కృష్ణలక్ష్మణ్ స్వామి, వీరబాబు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

మార్చి 14 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 22 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకు అమ్మకాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 14వ తేదీ నుంచి ఎన్ఎల్ఎస్ ఏరియాలో వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. బుధవారం గుంటూరు పొగాకు ప్రధాన కార్యాలయంలో బోర్డు ప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పొగాకు రైతు సంఘాల నాయకులు, బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వేలం కేంద్రాల ప్రారంభంపై ఒక నిర్ణయం తీసుకున్నారు.

మూడు దశల్లో కొనుగోళ్లు

ఈ ఏడాది మూడు దఫాలుగా రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. మొదటి దశలో భాగంగా ఫిబ్రవరి 29న ఒంగోలు-1, కొండేపిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. రెండోదశలో మార్చి 6న కందుకూరు-1, కందుకూరు-2, వెల్లంపల్లి బోర్డు పరిధిలో, మూడోదశలో మార్చి 14 నుంచి ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, పొదిలి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యల గూడెం, జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2 బోర్డుల పరిధిలో ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో ఒక్కొక్కటి, జంగారెడ్డిగూడెంలో రెండు మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 14,600 లైసెన్స్ బ్యారన్‌లు ఉన్నాయి. 60 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది సీజన్ ప్రారంభ రోజుల్లోనే మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్జీనియా పరిధిలో పొగాకు పంట దారుణంగా దెబ్బతింది. పంటను దున్నేసి మరలా మొదటి నుంచి నాట్లు వేశారు. పెట్టుబడులతో పాటు అధిక ధరలకు నారు కొని సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది.

గత ఏడాది అదుర్స్

గతేడాది పొగాకు మార్కెట్ అదిరిపోయే ధరలతో మోతమోగించాయి. పొగాకు చరిత్రలోనే అనీవినీ లేని ధరలతో రికార్డులు సృష్టించాయి. వేలం ప్రక్రియ ప్రారంభం రోజు నుంచే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. రికార్డు స్థాయిలో కేజీ పొగాకు గరిష్టంగా రూ.288 నమోదై రాష్ట్రంలోనే ఆల్‌టైం రికార్డును నమోదు చేసుకుంది. పదేళ్ల క్రితం కేజీ పొగాకు రూ.200 మైలురాయిని దాటింది. ఆ తరువాత 2019లో కేజీ ధర రూ.230 నమోదవ్వగా 2020లో కేజీ పొగాకు రూ.245 ధర పలకడంతో రికార్డుకెక్కింది. తరువాత గతేడాది రూ.288తో మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉండి మంచి ధరలు రావాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

సినీ ఫక్కీలో బంగారం దోపిడీ

భీమవరంలో కలకలం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 22 : భీమవరం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి బాలు షేట్‌ను తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలో పోతవరం వద్ద ఐదుగురు దుండగులు ఇంకమ్ ట్యాక్స్ అధికారులమని చెప్పి మూడున్నర కిలోల బంగారం, 5 లక్షల నగదు దోచుకెళ్ళినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన భీమవరంలో కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన బాలు సుమారు 30 సంవత్సరాల క్రితం భీమవరం వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడే ముందుగా ద్రావకం షాపు (బంగారం కరిగింపు) పెట్టి వ్యాపారాన్ని పెంచు కున్నారు. ప్రస్తుతం బంగారం హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, నర్సాపురం, పాలకొల్లు, ఏలూరు జిల్లా జంగా రెడ్డిగూడెం, ఏలూరు, కైకలూరు వంటి పట్టణాలలోని షాపులకు బంగారం విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారిని పసిగట్టిన దుండగులు వెంబడించి ఈ చోరీకి పాల్పడినట్లుగా చెబుతున్నారు.

కుమారుడి భవిష్యత్తుపై బెంగతో వృద్ధుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : తన కుమారుడి జీవితం పాడైపోయిందని మనస్థాపానికి గురై ఒక వృద్ధుడు పురుగుమందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరా కాలనీకి చెందిన కాసాని విశ్వేశ్వరరావు (70) కోడలు తన కుమారుని వదిలి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి అతని కుమారుడు ఒంటరిగా ఉంటున్నాడు. తన కుమారుడి జీవితం పాడైపోయిందని మనస్థాపానికి గురైన తండ్రి విశ్వేశ్వరరావు గురువారం పురుగుమందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందుల షాపు సీజ్



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : నిషేధిత క్రిమి సంహారక మందులు నిల్వ ఉన్నట్లుగా జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్‌కు అందిన సమాచారంతో విజిలెన్సు అధికారులు ఒక షాపుపై దాడి చేశారు. వేలేరుపాడు మండలం వసంతవాడలో శ్రీసాయి రూప మణికంఠ ట్రేడర్స్‌పై విజిలెన్సు, రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. నాలుగు వేల 200 రూపాయల విలువ కల్గిన నిషేధించిన పురుగుమందులను నిల్వ ఉంచారని, 32,572 రూపా యల విలువైన 1.63 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించామ న్నారు. దీంతో ఆ షాపును సీజ్ చేసి షాపు యజమాని పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ సీఐ విల్సన్, విజిలెన్స్ ఏవో సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు మేకా ఈశ్వరయ్య

రెండో రోజు కొనసాగిన జనసేన రిలే నిరాహార దీక్షలు

చింతలపూడి, ఫిబ్రవరి 22: మండల, పట్టణ సమస్యల పరిష్కారం కోరుతూ జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక రిలే దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ రోడ్ల సమస్యలు, వీధిలైట్లు, నగర పంచాయతీలో డ్రెయినేజీ సమస్యలు, ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని తాము చేపట్టిన దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారన్నారు. గురువారం సాయంత్రం దీక్షా శిబిరం ముగిసింది. లోక్‌సత్తా నాయకులు ఎ.అప్పారావు, టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, మారుమూడి థామస్, అనీష్‌కుమార్, తాటి అప్పారావు, బీజేపీ నాయకులు తోట నారాయణ, ఎస్.ప్రసాద్, శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించారు. మండల జనసేన అధ్యక్షుడు చీదరాల మధుబాబు, పలువురు దీక్షలో పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కూటమి విజయం ఖాయం



పోరుబాటలో రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22: నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపి జనసేన, టీడీపీ కూటమిని ప్రజలు గెలిపిస్తారని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలో గురువారం పలు డివిజన్లలో పోరుబాట నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, ఒబిలిశెట్టి శ్రావణగుప్త, బొత్స మధు, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను తదితరులు ఉన్నారు.

చేబ్రోలులో జనంలోకి జనసేన



చేబ్రోలులో ధర్మరాజు పర్యటన

ఉంగుటూరు, ఫిబ్రవరి 22: మండలంలోని చేబ్రోలులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు గురువారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాధ్యక్షులు పంది రాంబాబు, పత్తి మదన్, నిమ్మల దొరబాబు, నగరపాటి ఫణీంద్ర, గంగుమోలు చిన రత్తయ్య, ఇంటి మంగరాజు, మీసాల హరి, గోలి సాయి, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

'తపన' సేవా కార్యక్రమాల్లో రేణుకా చౌదరి



రేణుకాచౌదరికి స్వాగతం పలుకుతున్న మహిళలు

కామవరపుకోట, ఫిబ్రవరి 22: బీజేపీ నాయకుడు తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయచౌదరి సతీమణి రేణుకాచౌదరి గురువారం ఆడమిల్లి, కొత్తూరు, కామవరపుకోట గ్రామాల్లో పర్యటించారు. ఆడమిల్లిలో సర్పంచ్ గూడపాటి కేశవరావు, మహిళా ప్రతినిధులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. తపన ఫౌండేషన్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను కొత్తూరు, కామవరపుకోట గ్రామాల్లో అందజేశారు. రానున్న ఎన్నికల్లో ఏలూరు ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా గారపాటి సీతారామాంజనేయచౌదరి పోటీ చేస్తారని, ఆయనకు అందరూ సహకరించాలని కోరారు. ఆమె వెంట ఫౌండేషన్ సభ్యులు నరకుళ్ళ ఆశ, గణేష్, లక్ష్మీనారాయణ, టైలరింగ్ శిక్షకురాలు లక్ష్మీ, అంబికా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'కాల' భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22: కలెక్టరేట్ ప్రాంగణంలో కాంపిటీషన్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజేషన్ విభాగం భవన నిర్మాణ పనులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ బి.లావణ్యవేణి గురువారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల శాఖలకు సంబంధించి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను గృహ నిర్మాణశాఖకు అప్పగించామన్నారు. గృహ నిర్మాణశాఖ పీడీ రవికుమార్, విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్, ఆర్డీవో ఖాజావలీ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం పీఎం విశ్వకర్మ పథకం



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ఏడీ ఆదిశేషు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22: చేతివృత్తులవారిని, హస్త కళాకారులను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్దేశించి పీఎం విశ్వకర్మ పథకం అమలు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ ఏడీ ఆదిశేషు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకంపై ఎంఎస్ఎంఈ, పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆది శేషు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ పథకం ఉద్దేశం, ప్రయోజనాలను వివరించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, డీపీవో పి.విశ్వనాథ్, ఎంఎస్ఎంఈ ఏడీ కెఎల్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అటవీ సిబ్బందికి అవగాహన



వెదురు, ప్లాంటేషన్‌లు పరిశీలిస్తున్న సిబ్బంది

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 22 : దర్భగూడెం అటవీశాఖ పరిధిలో వెదురు, టేకు ప్లాంటేషన్‌లను రాష్ట్ర ఫారెస్టు అకాడమీ ఉద్యోగులకు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు వి.శ్రీహరిగోపాల్, ఎస్.రవిశంకర్ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అడవుల పెంపకం వాటి అభివృద్ధికి కృషి చేసేందుకు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులకు శిక్షణ అనంతరం పదోన్నతి పొందేందుకు అవగాహన కల్పించారు. అటవీలో ఉండే వివిధ జాతుల మొక్కలు వాటి పెరుగుదల నేల స్వభావం, వివిధ కాలాల్లో పెరిగే ప్లాంటేషన్ పెంచే విధానంపై అధికారులు వివరించారు. 7వబ్యాచ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 10వ బ్యాచ్ బీట్ ఆఫీసర్లు 54మంది శిక్షణలో ఉన్నారు. డీఎఫ్‌వో రవిశంకర్, సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య, జంగారెడ్డిగూడెం రేంజ్ అధికారి ఎస్‌కె.వల్లీ, బీట్ ఆఫీసర్ జి.మారేష్, సిబ్బంది రాఘవులు రహమద్ ఉన్నారు.

గిరిజన సంక్షేమ శాఖను ప్రక్షాళన చెయ్యాలి



వార్డెన్‌తో మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 22 : గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహానికి పాడైన చికెన్, నాణ్యత లేని కూరగాయలు, సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. కమిటీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు గురువారం ఆశ్రమ పాఠశాల్లో వార్డెన్‌ను కలిశారు. వసతిగృహాలకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తూ కాంట్రాక్టర్లు ఆదివాసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. 300 మంది పిల్లలు ఉన్న పాఠశాల సిబ్బందిని ఏటీడబ్ల్యూవో తన ఆఫీసు కార్యకలాపాలకు వాడుకోవటం తగదన్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలైన ఘటనపై విచారణ జరిపి బాధ్యుల్ని శిక్షించాలన్నారు. కుర్సం దుర్గారావు, సోడెం ముక్కయ్య, తెల్లం రవిప్రసాద్, పూనెం వెంకటేశ్వరావు ఉన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర వాహనం ప్రారంభం

ఉంగుటూరు, ఫిబ్రవరి 22: నారాయణపురంలో బీజేపీ ప్రజా పోరుయాత్ర వాహనాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన్ ప్రతినిధి నూకల మధుకర్, శరణాల మాలతీరాణి, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల నేతలు పాల్గొన్నారు.

నిరసన

ఢిల్లీలో రైతులపై కాల్పులకు వామపక్షాల ఆగ్రహం

ఈ-చలాన్‌లు రద్దు చేయాలని వాహన డ్రైవర్ల రిలే దీక్ష



ఆటో, క్యాబ్ వాహనాలపై చలాన్లకు నిరసనగా రిలే దీక్ష



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో వామపక్షాల ధర్నా

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22: వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం పోలీసులు కాల్పులు జరపటాన్ని ఖండిస్తూ గురువారం పాత బస్టాండ్ సెంటర్లో వామపక్షాలు ధర్నాలు నిర్వహించాయి. సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు ఆందోళన చేపట్టాయి. సీపీఐ ఏలూరు కార్యదర్శి హేమశంకర్, సీపీఎం కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోదీ ప్రభుత్వం పోలీసులు కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులపై జరిపిన కాల్పుల్లో శుభ్‌కరణ్‌సింగ్ అనే రైతు మరణించారని, 30 మందికి పైగా రైతులు గాయపడ్డారన్నారు. రైతన్నలపై పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపించిందని విమర్శించారు. రైతులు కోరుతున్నట్లు పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బి.సోమయ్య, డీఎన్‌వీడీ.ప్రసాద్, ఆదిశేషు, పీవీ.రామకృష్ణ, కె.విజయలక్ష్మి, కుప్పాల కన్నబాబు, ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-చలానాలు రద్దుచేయాలి

ఆటో, క్యాబ్ వాహనాలపై ఈ-చలానాలు రద్దుచేసి సాఫ్ట్‌లైన్ సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో దీక్షలు చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివాజీ, ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా నగరంలో లోపభూయిష్ట సిగ్నల్, సీసీ కెమెరాలకు ఆటో, క్యాబ్, ట్రక్కు డ్రైవర్లు బలైపోతున్నారని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, ఇప్పటివరకు ఉన్న ఈ చలానాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికులు అందరికి సంక్షేమ చట్టాన్ని చేయాలని కేరళ, తమిళనాడు తరహాలో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ.ప్రసాద్, సీఐటీయూ నాయకులు డి.సోమయ్య, జగన్నాథం తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షల్లో పలువురు ఆటో డ్రైవర్లు, నాయకులు అమర్‌కుమార్, బి.సూరిబాబు, ఎం.రాఘవ తదితరులు పాల్గొన్నారు.









బుట్టాయగూడెం మండలంలో బొరగం శ్రీనివాస్ ప్రచారం, ఏలూరులో సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి, భీమడోలు మండలంలో గన్ని, నేతల ప్రచారం, ఉంగుటూరులో పందికోడుపై గన్ని సెల్ఫీ చాలెంజ్

వైసీపీ పాలనలో

వ్యవస్థలు నిర్వీర్యం

తెలుగుదేశం పార్టీ నేతల ధ్వజం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 22: జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, పంచాయతీరాజ్ శాఖ మరింత అధ్వానమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. సర్పంచ్‌ల అధికారాలను నిర్వీర్యం చేశారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పటిష్టమైన భద్రత కల్పించి బలోపేతం చేస్తామని ఆయన అన్నారు. కోటనాగవరంలో గురువారం స్థానిక స్వపరిపాలన, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచ్‌లకు గౌరవం కల్పించి వారి అధికారాలను స్వేచ్ఛగా వాడుకునేలా చూస్తామన్నారు. వేతనం ఐదు రెట్లు అధికంగా కల్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లోతు నాగబాబు, సున్నం నాగేశ్వరావు, మొడియం సింగరాజు, గద్దె అబ్బులు, పసుమర్తి భీమేశ్వరావు, మాటూరి ముసలయ్య, వరక కృష్ణంరాజు, పి.రాంబాబు, మడకం రామకృష్ణ, పాయం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతప్పగూడెం పంచాయతీ దాసియ్యపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని బొరగం శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మడకం కన్నపరాజు, సుంకర సత్యనారాయణ, కె.శ్రీను, వేరుకొండ సురేష్, కుక్కల సుబ్బారావు, కుంజా పండు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేసిన సైకో జగన్ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు టీడీపీ, జనసేన కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి పిలుపునిచ్చారు. స్థానిక 28వ డివిజన్ శాంతినగర్‌లో ప్రజాసంకల్పయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. చంటి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టి వారి ఆశలను అడియాశలను చేశారని, దోపిడి దొంగల మాదిరిగా సహజవనరులు దోచుకున్నారని విమర్శించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆర్.ఎస్.ఆర్ నాగేశ్వరరావు, డివిజన్ ఇన్‌చార్జ్ ఏ.రామకృష్ణ, కేతినీడి భాస్కర్‌రావు, కిషోర్, వి.బాబురావు పాల్గొన్నారు.

● భీమడోలు: అక్రమ ఇసుక తవ్వకుంటూ కోట్లకు పగడలెత్తుతున్న జగన్, వైసీపీ నాయకులను ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ధ్వజమెత్తారు. కురెళ్ళగూడెంలో మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గన్ని మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్ల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇసుక దందాపై కేంద్ర పర్యావరణ శాఖ ఇసుక నివేదికపై జగన్ రెడ్డి ఏ సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500పైగా రీచ్‌లలో తవ్వకాలు జరుపుతున్నారని ఆయన అన్నారు. తవ్వకాల్లో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని రాష్ట్ర స్థాయి పర్యావరణశాఖ తేల్చిందన్నారు. ఎటు వంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ఇసుక దందా నడుస్తుందని ఎన్నికల్లో ఇసుకతో దోచుకున్న డబ్బుతో గెలవాలని జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు చేసిన దందాలను బయటకు తీస్తామన్నారు. కురెళ్ళగూడెంలో గన్ని వీరాంజనేయులు సతీమణి లక్ష్మీకాంతం, ఆయన సోదరుడు నాగగోపాలరావు, సత్యవాణి కుటుంబ సభ్యులతో ఇంటింటికి తిరిగి అధిక మెజార్టీ ఇవ్వాలంటూ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● ఉంగుటూరు: నిడమర్రు మండలాన్ని కలుపుతూ పంది కోడ డ్రైన్‌పై వంతెన నిర్మాణం తామే పూర్తి చేశామని గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఆ వంతెన పై సెల్ఫీ తీసుకుని అభివృద్ధిపై చర్చకు సవాల్ విసిరారు.

వైభవంగా రామకోటి ఉత్సవాలు ప్రారంభం



ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో రామకోటి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సీతారామ లక్ష్మణ హనుమంతులకు విశేష పూజలు, గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. ధ్వజారోహణ నిర్వహించారు. రామకోటి ప్రాంగణాన్ని పంచరంగుల తోరణాలు, విద్యుద్దీపాలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విశ్వశాంతి సమాజం కార్యవర్గ సభ్యులు కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, వి.సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, పాదర్తి బాలకృష్ణల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

వేణుగోపాలుని కల్యాణోత్సవాల్లో హోమాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22: తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం మహాశాంతి హోమాన్ని నిర్వహించారు. శ్రీవారిని, అమ్మవార్లను శేష వాహనంపై మేళతాళాలతో ఊరేగింపు జరిపారు. శుక్రవారం స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

కైకరంలో వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 22: కైకరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలస్వామి వార్షిక కల్యాణం గురువారం జరిపించారు. వంశ పారంపర్య ధర్మకర్త యెగ్గిన శేషయ్య దొర సోదరుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని కొడవటిగంటి వేంకట రాజన్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణం తిలకించారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు

టి.నరసాపురం, ఫిబ్రవరి 22: బొర్రంపాలెం కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవాలు ఈనెల 26 వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు వీరంకి వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి సేవల్లో జాప్యం నివారించాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : ప్రభుత్వాసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్‌లో జాప్యం జరుగుతుందని, సదరన్ సర్టిఫికెట్లకు వచ్చే వారికి రోజులు తరబడి వేచి ఉండాల్సి వస్తుందని, ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్లలో జాప్యం జరుగుతుందని, తక్షణం పరిష్కరించాలని మెడికల్ సూపరింటెండెంట్‌కు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. జడ్పీ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, మెడికల్ సూపరింటెండెంట్‌లతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బందికి షిఫ్టు వారీ డ్యూటీలు మార్చాలని అన్నారు. ఔట్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బందిని ఎక్కువ మందిని నియమించాలన్నారు. పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నందున రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఇవో కెఎస్ఎస్ సుబ్బారావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆగ్నేస్ విజయలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయి కృషి

పెదపాడు, ఫిబ్రవరి 22 : గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో తగిన కృషి చేస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేటాయించిన నిధులు, అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం జడ్పీ చైర్మన్ పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఘంటా ప్రసాదరావు, ఆళ్ళ సతీష్‌చౌదరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రంలో డి అడిక్షన్ సెంటర్ ప్రారంభం



సెంటర్ ప్రారంభిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22: మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడానికి ఆశ్రం ఆస్పత్రిలో డి అడిక్షన్ సెంటర్‌ను ఎస్ఈబీ జేడీ, ఏఎస్పీ నక్కా సూర్య చంద్రరావు గురువారం ప్రారంభించారు. ఆసుపత్రి డైరెక్టర్ గోకరాజు రతీదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల బారినపడ్డ రోగులకు చికిత్స అందించడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి ఆశ్రం ముందడుగు వేసిందన్నారు. మనో వ్యాధి చికిత్స విభాగం, ప్రత్యేక డిఅడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.

ఎత్తిపోతల కాలువ గట్టు తవ్వకాలు నిలిపివేయాలి

టి.నరసాపురం, ఫిబ్రవరి 22: చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టి తవ్వకాలు నిలిపివేయాలని ఘంటా సతీష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఉదయ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కృష్ణాపురం, పుట్రేవు గ్రామాల సమీపంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టిని ఎక్స్‌కవేటర్లతో తవ్వి లారీల్లో తరలిస్తున్నారని ఆయన తెలిపారు. గట్టు నాణ్యత తగ్గే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో ప్రాధాన్యం గల చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు అక్రమార్కులు అక్రమంగా తవ్వేస్తున్నారని, వెంటనే తవ్వకాలు నిలిపివేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

చెరకు మద్దతు ధర రూ.5వేలు ప్రకటించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22: కేంద్రం 2024-25 చెరకు క్రషింగ్ సీజన్‌కు టన్ను చెరకుకు రూ.3,400 మద్దతు ధర ప్రకటించిందని, ఈ ధర రైతులకు ఏ మాత్రం సరిపోదని, టన్నుకు రూ.5వేలు ప్రకటించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం అన్నే భవనంలో చెరకు మద్దతు ధరపై మాట్లాడారు. కేంద్ర ధరల నిర్ణయాయక సంఘం సిఫార్సు ఆధారంగా చెరకు మద్దతు ధర నిర్ణయించారన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను పరిగణలోకి తీసుకుని మద్దతు ధర ప్రకటించలేదన్నారు.

భూమి ఇచ్చిన రైతుకు ముప్పుతిప్పలు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 22: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలకు రెండు ఎకరాల భూమి ఇచ్చిన రైతును అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారు. సుమారు ఏడేళ్ల క్రితం భూమిని ఇచ్చిన రైతుకు వేరొక చోట భూమి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు భూమి కేటాయించకపోవడంతో పాఠశాల క్రీడా ప్రాంగణానికి రైతు బుధవారం రాత్రి తాళాలు వేశాడు. దీనితో గురువారం అధికారులు రైతుతో చర్చలు జరిపి రైతు కోరినచోట భూమికి భూమిని ఇస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తెరిచారు. తెల్లంవారిగూడెం ఏపీ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలకు సరిపడ స్థలం లేకపోవడంతో పక్కనే ఉన్న కణితి వెంకయ్యకు చెందిన 2 ఎకరాల భూమిని గ్రామస్తులు అంతాకలిసి 2017లో ఆశ్రమ పాఠశాలకు ఇప్పించారు. వెంకయ్యకు మరోచోట భూమిని ఇప్పించే విధంగా మాట్లాడారు. అనంతరం వెంకయ్యకు అధికారులు వేర్వేరు చోట్ల స్థలాన్ని చూపించినా అంగీకరించలేదు. భూమి మొత్తాన్ని ఒకేచోట ఇవ్వాలని కోరాడు. ఒకేచోట భూమి లేకపోవడంతో రెండు చోట్ల అధికారులు భూమిని చూపించారు. అంగీకరించని వెంకయ్య పలుమార్లు ఆటస్థలానికి తాళాలు వేశాడు. భూమిని ఇవ్వాలని వెంకయ్య స్థలానికి తాళం వేసి నిరసన తెలపడంతో అధికారులు చర్చలు జరిపారు. ఒకేచోట భూమి కావాలని కోరడం తహసీల్దార్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. అధికారి హామీతో వెంకయ్య తాళాలు తెరిచాడు. కార్యక్రమంలో ఆర్ఐ గంగరాజు, ఎటిడబ్ల్యువో శ్రీవిద్య, ఎఎంవో శిరమయ్య పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ కేసు విచారణ ఏప్రిల్ ఒకటికి వాయిదా

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : అగ్రిగోల్డ్ కేసులపై ఏలూరు జిల్లా కోర్టులో విచారణ జరిగింది. 11 కేసులకు సంబంధించి గురువారం జిల్లా కోర్టులో వాయిదాకు నిందితులు హాజరయ్యారు. వాదోపవాదాల అనంతరం జడ్జి ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేశారు. అగ్రిగోల్డ్ చైర్మన్ అవ్వా వెంకట రామారావుతో పాటు అగ్రిగోల్డ్ కేసులో ఉన్న వారు కోర్టుకు రావడానికి సొంత సెక్యూరిటీగా బౌన్సర్లను సఫారీ డ్రస్సుల్లో తెచ్చుకున్నారు. ప్రత్యేక వాహనాల్లో కోర్టు ఆవరణలోకి వచ్చి అక్కడ నుంచి కోర్టు వాయిదాకు హాజరయ్యారు. కేసు వాయిదాపడడంతో తిరిగి మధ్యాహ్నంవెళ్లిపోయారు.

ఏలూరులో డిగ్రీ డేస్ చిత్రీకరణ

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 22: ఏలూరు జడ్పీ కార్యాలయ ఆవరణలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఛాయ్ బిస్కెట్, సోసీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డిగ్రీ డేస్ సినిమాలో హీరో, హీరోయిన్ తదితరులపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. జడ్పీ కార్యాలయంతో పాటు ఏలూరు కొత్త బస్టాండు, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశారు. హీరోగా మౌర్య, హీరోయిన్‌గా సాయిశ్వేత నటిస్తున్నారు. డిగ్రీ కళాశాల చుట్టూ జరిగే నేపథ్యంపై, యువతకు సంబంధించి కుటుంబ కథా చిత్రంగా డిగ్రీడేస్ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు డైరెక్టర్ అభినయ్‌కృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో హీరో మౌర్య లెక్చరర్‌గా, సాయిశ్వేత ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా నటిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రం తొలుత ఓటీటీ ద్వారా రిలీజ్ చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. సినిమా షూటింగ్ చూసేందుకు స్థానికులు ఉత్సాహం చూపారు.



చింతలపూడిలో టీడీపీ జెండా ఎగురవేస్తా : రోషన్



ఫాతిమాపురంలో రోషన్ నేతల స్వాగం

చింతలపూడి, ఫిబ్రవరి 22: పార్టీలో అందరితో సమన్వయంతో పనిచేసి చింతలపూడిలో టీడీపీ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. సమావేశంలో ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, రాధారాణి పాల్గొన్నారు. ఫాతిమాపురంలో రోషన్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. తాళ్ళూరి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖరరెడ్డి, కెటిఆర్, శ్రీనివాసరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

● కామవరపుకోట: నియోజకవర్గం ఇన్‌చార్జిగా సొంగా రోషన్‌కుమార్‌ను పార్టీ నియమించడంపై జలపావారిగూడెం, అంకాలంపాడు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. వడ్లపట్ల నరసింహమూర్తి, దివాకర్, మురళీ, సతీష్, నక్కా వెంకటేశ్వరరావు, ఉప్పే భీమయ్య మధు, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు డీఎస్పీగా లక్ష్మయ్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22: నూజివీడు డీఎస్పీగా జి.లక్ష్మయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల బదిలీల్లో నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ మురళీకృష్ణను బాపట్ల డీఎస్పీగా నియమించారు. ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న జి.లక్ష్మయ్యను నూజివీడు డీఎస్పీగా నియమించారు. ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఎటాచ్డ్ డీఎస్పీగా పోస్టింగ్ పొందిన తుపాకుల వెంకట రత్నస్వామిని తిరిగి తూర్పుగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా, ఎటాచ్డ్ డీఎస్పీగాను నియమించారు.

రాజకీయ పార్టీలు కౌలు రైతు సమస్యలపై స్పందించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 22: రాన్నున ఎన్నికల్లో పోటీచేస్తున్న రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో కౌలు రైతు సమస్యలను చేర్చాలని ఏపీ కౌలు రైతు సంఘం, రైతుసంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో కౌలురైతు సమస్యలతో కూడిన 12పేజీల బుక్‌లెట్‌ను నాయకులు ఆవిష్కరించారు. డేగా ప్రభాకర్, ఆర్.లక్ష్మణరావు, బి.కృష్ణ, మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. జి.వెంకట్రావు, బండి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మహిళ మృతదేహం

పెదవేగి, ఫిబ్రవరి 22: జాతీయ రహదారిపై అమ్మపాలెం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. రహదారి డివైడర్‌పై సుమారు 40 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహం ఉందని స్థానికులు గురువారం సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. భిక్షాటన చేస్తూ తిరుగుతుందని, గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** నియోజకవర్గంలోని 79 సచివాలయాల్లోని 1495 మంది వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డులను ఎమ్మెల్యే ఆళ్ళ నాని, షేక్ నూర్జహాన్ అందజేశారు.
- **చింతలపూడి :** చింతలపూడి కోర్టు పరిధిలోని రాజీపడతగ్గ కేసులు మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు సూచించారు.
- చింతలపూడి మండలం ప్రగడవరంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న వెంపా దుర్గారావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రం వైద్య బృందం 398 మందిని పరీక్షించింది. 50 మందికి నేత్ర, గుండె ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.
- **పెదపాడు :** వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు జానంపేట విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు 60 మందికి అన్న సమారాధన చేశారు. కళాశాల ఎండీ కె.సాయిరోహిత్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** కొత్తపల్లి రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి, రైతులకు ఈ డ్రిప్ మెయింటినెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఎంఐపీ పి.డి రవికుమార్, జయరామ్ సూచనలు ఇచ్చారు.
- లింగపాలెం మండలం భోగోలు, అయ్యప్పరాజుగూడెం, ములగలంపాడు, సింగగూడెం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లను ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభించారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం సచివాలయం డ్రైనేజీలను ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలంలో ఇళ్ల నిర్మాణంపై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డ్వామా సిబ్బందితో అధికారులు సమీక్షించారు. జిల్లా హౌసింగ్ అధికారి కేఎస్ఆర్.రవి కుమార్, ఎంపీడీవో శర్మ, ఏఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

నూజివీడు డీఎస్పీగా లక్ష్మయ్య



ఏలూరు క్రైం/నూజివీడు, ఫిబ్రవరి 22:నూజివీడు డీఎస్పీగా జి.లక్ష్మయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలను బదిలీ చేయగా వీరిలో ఏడుగురిని మార్పులు, చేర్పులు చేశారు. నూజివీడు డీఎస్పీగా పనిచేసి ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్-2 ఏసీపీగా వెళ్ళిన డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్‌ను తుళ్ళూరు డీఎస్పీగా నియమించారు. జిల్లా ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును గతంలో తుళ్ళూరు డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆయనకు తిరిగి ఇంటెలిజెన్స్ డీఎస్పీగానే పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ మురళీ కృష్ణను బాపట్ల డీఎస్పీగా నియమించారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న జి. లక్ష్మయ్యను నూజివీడు డీఎస్పీగా నియమించారు. ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఎటాచ్డ్ డీఎస్పీగా పోస్టింగ్ పొందిన తుపాకుల వెంకటరత్నస్వామిని తిరిగి తూర్పుగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగాను, ఎటాచ్డ్ డీఎస్పీగాను నియమించారు. గత నెల రోజుల్లో నూజివీడు డీఎస్పీల బదిలీలు ముచ్చటగా మూడోసారి జరిగాయి. స్థానికత, ఇతర నియమ నిబంధనలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే వాదనలు వినిపిస్తున్నాయి.

మీడియాపై దాడులు అప్రజాస్వామికం


గోపాల్

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 :ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిన మీడియాపై దాడులు జరగటాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని దక్షిణ భారత కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పండలనేని గోపాల్ అన్నారు. గురువారం ముదినేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ కార్యకర్తల దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేయడం దారుణమన్నారు. మీడియా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేందుకు ఏపీలో జరుగుతున్న ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు.

రాజకీయ లబ్ధి కోసమే బలివే బ్రిడ్జి నిర్మాణం

- ఈ పనులతో రానున్న మహాశివరాత్రి భక్తులకు ఇబ్బందులు
- పూర్తికాని భూసేకరణ, తొలగించిన విద్యుత్, గ్యాస్ లైన్‌లు


బలివే వద్ద తమ్మిలేరులో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

ముసునూరు, ఫిబ్రవరి 22 : బలివే తమ్మిలేరుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను హుటాహుటిన ప్రారంభించడం రాజకీయ లబ్ధి కోసమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ విజయరాయి వైపు భూసేకరణ పూర్తికాలేదు. బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు పది రోజుల్లో ప్రారంభమవుతున్న నేపథ్యంలో బ్రిడ్జి పనులు చేపట్టడం వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమేనని పలువురు పేర్కొంటున్నారు. గురువారం రెండు ఎక్స్‌కవేటర్‌లతో మట్టిని తొలంగించే పనులు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో భక్తులకు జల్లు స్నానాలు ఏర్పాటుతో పాటు పిండప్రదానాలు చేసే ప్రదేశంలోనే సుమారు పది అడుగులు లోతులో గుంతలు తవ్వడంతో భక్తులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం తమ్మిలేరులోని తాత్కాలిక రహదారిని సైతం తీసివేసి మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా, విజయరాయి వైపు భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో రైతులు తమ భూముల్లో నుంచి రహదారి వేసే ఊరుకునే ప్రసక్తే లేదని అధికారులు, కాంట్రాక్టర్‌కు తేల్చిచెప్పినట్లు సమాచారం. ఎన్నికల లోపే బ్రిడ్జి పనులు చేపట్టామని అధికార పార్టీ నాయకులు చెప్పుకుని ఓటు బ్యాంక్ రాజకీయానికి తెర లేపారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాది క్రితమే నిధులు మంజూరు

గత ఏడాది మార్చిలో దెందులూరులో జరిగిన ఆసరా సభలో సీఎం జగన్ బలివే తమ్మిలేరుపై హైలెవెల్ బ్రిడ్జి, చెక్‌డ్యామ్ నిర్మాణం, భక్తులకు స్నాన ఘట్టాలు తదితర వాటి కోసం రూ.18 కోట్లు నిధులు మంజూరు చేసి, వర్చువల్ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనుల ఊసే మరిచారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏడాది తర్వాత పనులు ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వంలో బలివే, విజయరాయి వైపు భూసేకరణకు కొంత నిధులు విడుదల చేయగా బలివే వైపు భూసేకరణ పూర్తయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ తీసుకురావడంతో బ్రిడ్జి నిర్మాణ ప్రక్రియ ఆగిపోయింది.

కోతుల నియంత్రణకు ఎలుగుబంటి వేషధారణలు



ఎలుగుబంటి డ్రస్సులతో కార్మికులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22:నూజివీడు మునిసిపల్ పరిధిలో కోతుల ఎద్దడినుంచి ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గత మూడు కౌన్సిల్ సమావేశాల నుంచి కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికార, ప్రతిపక్ష సభ్యులు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తూ తీర్మానాలు చేయగా, కోతుల నియంత్రణకు ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కోతులను భయపెట్టి దూరంగా తరిమేందుకు ఎలుగుబంటి డ్రస్సులతో కార్మికులను వినియోగిస్తూ వాటిని దూరంగా పంపేప్రయత్నాన్ని గురువారం నుంచి చేపట్టారు.

అగ్నిప్రమాద బాధితులకు 'కొలుసు' సాయం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22: షార్ట్ సర్క్యూట్ కారణంగా నివాసాలు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి చేయూతను అందించారు. నూజివీడు మండలం మొర్సపూడి గ్రామంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఆరేపల్లి బసవయ్య, ఆరేపల్లి ధనకోటేశ్వర రావులకు చెందిన పూరిళ్ళు దగ్ధం అయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితులను పరామర్శించిన నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారధి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాధితులకు పక్కాఇళ్ళు మంజూరు చేయించడంతో పాటు ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులతో మాట్లాడారు. భవిష్యత్తులో తనవంతు ఆర్థికసాయం అందిస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు.

నూజివీడులో జబర్దస్త్ టీమ్ సందడి


అలరిస్తున్న జబర్దస్త్ టీమ్ సభ్యులు

నూజివీడు, ఫిబ్రవరి 22 : నూజివీడు పట్టణంలో జబర్దస్త్ టీమ్ సందడి చేసింది. బీజేపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చారిజ గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో జబర్దస్త్ టీమ్ ద్వారా ప్రదర్శనలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణంతో పాటు మండల పరిధిలో దేవరగుంట, గొల్లపల్లి, పల్లెర్లమూడి గ్రామాల్లో కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబి, వినోద్, ఇమ్మానియేలు పలు కామెడీ స్కిట్‌లతో అలరిస్తూ కేంద్ర పథకాలను వివరించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీఆర్‌కే రంగారావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వాసు, మండల కార్యదర్శి అంబటి నాగమల్లేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణలో అధికారులు.. పెండింగ్‌లో పనులు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 22: సార్వత్రిక ఎన్నికల శిక్షణలో అధికారులు నిమగ్నం అయ్యారు. నాలుగురోజుల నుంచి అధికారులు ఎన్నికల శిక్షణకు వెళ్ళడంతో కార్యాలయాల్లో అధికారులు, ప్రజలకు అందుబాటులో లేరు. వారం రోజులు నిర్వహించే ఈ శిక్షణకు జిల్లా కేంద్రమైన ఏలూరులో శిక్షణ పొందుతున్నారు. పలు పనులు కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లిపోతున్నారు.

ముదినేపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర

ముదినేపల్లి, ఫిబ్రవరి 22 :రానున్న ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి తనను గెలిపించాలని శాసనసభ్యుడు దూలం నాగేశ్వరావు కోరారు. గురువారం ఆయన ముదినేపల్లిలోని గురజ రోడ్డు సెంటర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్రను దూలం నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. నారసింహుని కల్యాణం



స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు...పట్టు వస్త్రాలను తెస్తున్న మంత్రి వనిత, ట్రస్టీ

భక్తజనసంద్రంగా సుందరగిరి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22: మహిమాన్వితుడిగా సుందరగిరిపై విరాజిల్లుతోన్న లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవం కొండ దిగువనున్న కల్యాణమండపంలో గురువారం ఉదయం వైభవంగా జరిగింది. సుందరగిరి పరిసరాలు భక్తజనుల నృశింహ నామస్మరణలతో మారుమోగాయి. చిన వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని ఈ ఆలయంలో ముందుగా కనకవల్లీ సమేత లక్ష్మి అమ్మవారితో నరసింహుని ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి కొండదిగువనున్న కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటిబోదెలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై ఉన్న సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. హోంమంత్రి తానేటి వనిత, ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో వేండ్ర త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శుభముహూర్త సమయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. పండితుల వేద మంత్రోచ్చరణలు, భక్తుల నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు ఘనంగా జరిగాయి.

వైభవంగా పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి సారధ్యంలో వేదాశీర్వచనం చేశారు. గురువారం సాయంత్రం హను మద్వాహనంపై, రాత్రి సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిం చారు. శుక్రవారం సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామి వారి చక్ర స్నానానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు సత్య నారాయణ తెలిపారు. ఆలయ చైర్మన్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, రాంబాబు, ఎస్ఐ రాము, దాసరి వాసు పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం'


నూజివీడులో టీడీపీ డిక్లరేషన్‌ను చూపుతున్న పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 22: టీడీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారధి అన్నారు. గురువారం నూజివీడు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకు అందేలా చర్యలు చేపట్టడంతో పాటు గ్రామస్థాయి, మున్సిపల్‌స్థాయి ప్రజాప్రతినిధులకు గౌరవవేతనాన్ని రూ.పది నుంచి రూ.20వేల వరకు పెంచేలా చర్యలు చేపడతామన్నారు. స్థానిక స్వపరిపాలన, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం డిక్లరేషన్‌ను పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు ఆమోదించారని, పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టానికి టీడీపీ చిత్తశుద్ధితో ఉందని, అందుకు మీ మద్దతు కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో లింగమనేని కిషోర్, రాము, అక్కినేని చందు, గద్దెరఘు, యనమదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిలువగట్టు తిరునాళ్లకు మూడున్నర లక్షలు వితరణ

శిలువగట్టు తిరునాళ్లకు నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పార్థసారధి మూడున్నర లక్షల రూపాయలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన భక్తుల సౌకర్యం కోసం మూడున్నర లక్షలు విలువచేసే విద్యుత్ పరికరాలను శిలువగట్టు తిరునాళ్ల కమిటీకి లాంఛనంగా అందించారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలి : కామినేని

కలిదిండి : వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం చినతాడినాడలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన మీడియా ప్రతినిధులపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమన్నారు. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే మంచి విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, నాయకులు తాడినాడ బాబు, కొత్తపల్లి బంగార్రాజు, సొర్రా అరవింద్, సంగాని గంగాధరరావు, తేరా రమేష్, కేశిరెడ్డి బలరామ్, పైడిపాటి శివశంకర్, పేటేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యం : కొనకళ్ల


వడాలిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల, తదితరులు

ముదినేపల్లి రూరల్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించి తీరుతుందని మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు స్పష్టం చేశారు. వడాలిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు వీరమల్లు సత్యనారాయణ కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో గురువారం రాత్రి పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు కాగిత కృష్ణప్రసాద్, కొనకళ్ల బుల్లయ్య, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, పరసా ఏడుకొండలు, జనసేన నాయకులు పంచకర్ల రమేష్, బీవీ రావు, వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

శిలువ మార్గం కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు


శిలుమార్గంలో టీడీపీ నాయకులు

మండవల్లి, ఫిబ్రవరి 22: లోకుముడి గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వారి ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురువారం పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కైకలూరు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, వీరబత్తిన సుధా, సంఘస్తులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీశంకరి

బలివే ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- ఆర్డీవో భవానీశంకరి ఆదేశం

ముసునూరు, ఫిబ్రవరి 22: బలివే శ్రీరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని నూజివీడు ఆర్డీవో వై.భవానీశంకరి ఆదేశించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో పలు శాఖల అధికారులతో ఆమె సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమై ఐదురోజులు పాటు జరిగే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి సకల ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పారిశుధ్యంతోపాటు క్యూలైన్‌లకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల పుణ్యస్నానాలకు తమ్మిలేరు జలాలతోపాటు జల్లుల స్నానఘాట్‌లను సిద్ధం చేయాలన్నారు. వైద్యసేవల నిమిత్తం మెడికల్ క్యాంప్‌లతోపాటు రెండు 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణకు సూచించారు. ముఖ్యంగా నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సర్పంచ్ రావు ప్రవీణసుధాకర్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలికుమారి, సీఐ బాలసురేష్, ఎస్ఐ పి.వాసు, ఆలయ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈవో నల్లూరి సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడి కల్యాణోత్సవాలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ

కలిదిండి, ఫిబ్రవరి 22:పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. గురువారం స్వామివారి ఆలయం వద్ద పలు శాఖల అధికారులతో ఉత్సవాల ఏ ర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఈ ఏడాది కూడా అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరు, తపస్సు చెరువుల్లో స్వచ్ఛత నీరు పెట్టాలన్నారు. ఆలయ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసు అధికారులు పర్య వేక్షించాలన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ మారుతీ ప్రసన్న, సొసైటీ చైర్మన్ వడుపు రామారావు, పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, ఎస్ఐ ప్రియకుమార్, ఆరోగ్యశాఖ, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొవ్వాడలంకలో బాబు ష్యూరిటీ కార్యక్రమం


కొవ్వాడలంకలో 'బాబు ష్యూరిటీ'లో టీడీపీ నాయకులు

మండవల్లి, ఫిబ్రవరి 22: కొవ్వాడలంకలో టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని వీరవెంకట నాగేశ్వరరావు, క్లస్టర్ ముళ్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ హామీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కైకలూరు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రకీబా, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి మారగాని మురళీకృష్ణ, కైకలూరు పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు పడమటి వాసు, కుర్మ నవీన్ బాబు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా స్వామివార్ల కల్యాణోత్సవాలు


స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

కైకలూరు, ఫిబ్రవరి 22: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో వున్న పార్వతీసమేత రామలింగేశ్వర, శ్రీరామేశ్వరస్వామి వార్ల శాంతి కల్యాణాలు కన్నులపండువగా నిర్వహించారు. గురువారం రాత్రి అమ్మవారి కళా మండపం వద్ద స్వామివార్లను, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకువచ్చి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని సీనియర్ న్యాయవాదులు గొర్తి ప్రభాకరదీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున కల్యాణాన్ని తిలకించారు. ఆలయాల చైర్మన్లు బూరుబోయిన మోహనరావు, గుర్రం రాంబాబు, ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

అన్నదాతలపై కేంద్రం నిరంకుశ వైఖరి దారుణం


పల్లెర్లమూడిలో రైతుల నిరసన ప్రదర్శన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 22: శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అన్నదాతలపై కేంద్రప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, రైతులపై పోలీసులు కాల్పులకు దిగడం దారుణమని రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ విమర్శించారు. రైతులపై కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ ధోరణిని నిరసిస్తూ పల్లెర్లమూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే రైతుల డిమాండ్లను నెరవేర్చేదిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.రాజు, ఎన్ఆర్ హనుమాన్లు, రైతు సంఘం నాయకులు ఘంటా పాపారావు, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఉచిత గుండె వైద్యపరీక్షలు


గుండె చికిత్స చేయించుకున్న రైతులతో వైద్య బృందం


చాట్రాయి, ఫిబ్రవరి 22: కృష్ణామిల్క్ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న మండలంలోని పాల సహకార సంఘాల సభ్యులైన 25 మంది పాడిరైతులకు, రాధా-లక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ డాక్టర్ వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌లో ఉచితంగా స్టంట్స్ వేయటం, యాంజియోగ్రామ్‌లు నిర్వహించినట్లు సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తెలిపారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చొరవతో 1700 మంది పాడి రైతులకు ఉచిత మాస్టర్ కార్డియాక్ చెకప్, 860 మందికి యాంజియోగామ్‌లు, స్టంట్స్ వేశామని వివరించారు. పాడి రైతులందరూ కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాలు పోసి సంక్షేమ పథకాలు అందుకోవాలని తెలిపారు.

అనాథల ఉన్నత విద్యాభివృద్ధికి హీల్ చేయూత

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22:పేదలు, అనాథలకు ఉన్నత విద్యావకాశాలను మరింత చేరువచేసేందుకు హీల్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను మరింత అభివృద్ధిచేసి విశ్వవిద్యాలయ హోదా ప్రతిపాదనకు మార్గదర్శకంగా చర్యలు చేపడుతున్నట్టు హీల్ ప్యారడైజ్ డైరెక్టర్ కోవెలమూడి దుర్గాదేవి అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో హీల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్‌కు శంకుస్థాపన కార్యక్రమాన్ని వేగే శ్రీనివాసరావు, వాణిల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి మాట్లాడుతూ హీల్ ప్యారడైజ్‌ను డీమ్డ్ -2బి యూనివర్శిటీ స్థాయికి తీసుకువెళ్ళే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు కృత్రిమ మేధస్సులో ఆవిష్కరణలను పెంచేందుకు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు జీడీపీ ప్రసాదరావు, కార్యదర్శి తాతినేని లక్ష్మి, కోశాధికారి మారగాని రామచంద్రరావు, హీల్ ఇండియా అధ్యక్షుడు రామావతా ర్‌యాదవ్, క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, డైరెక్టర్లు టి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

మార్చి 14 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 22 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకు అమ్మకాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 14వ తేదీ నుంచి ఎన్ఎల్ఎస్ ఏరియాలో వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. బుధవారం గుంటూరు పొగాకు ప్రధాన కార్యాలయంలో బోర్డు ప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పొగాకు రైతు సంఘాల నాయకులు, బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వేలం కేంద్రాల ప్రారంభంపై ఒక నిర్ణయం తీసుకున్నారు.

మూడు దశల్లో కొనుగోళ్లు

ఈ ఏడాది మూడు దఫాలుగా రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. మొదటి దశలో భాగంగా ఫిబ్రవరి 29న ఒంగోలు-1, కొండేపిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. రెండోదశలో మార్చి 6న కందుకూరు-1, కందుకూరు-2, వెల్లంపల్లి బోర్డు పరిధిలో, మూడోదశలో మార్చి 14 నుంచి ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, పొదిలి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2 బోర్డుల పరిధిలో ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో ఒక్కొక్కటి, జంగారెడ్డిగూడెంలో రెండు మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 14,600 లైసెన్స్ బ్యారన్‌లు ఉన్నాయి. 60 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది సీజన్ ప్రారంభ రోజుల్లోనే మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వర్జీనియా పరిధిలో పొగాకు పంట దారుణంగా దెబ్బతింది. పంటను దున్నేసి మళ్లీ మొదటి నుంచి నాట్లు వేశారు. పెట్టుబడులతో పాటు అధిక ధరలకు నారు కొని సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తులు

కలిదిండి, ఫిబ్రవరి 22 :విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత విద్య కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్, అన్ ఎయిడెట్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయించామన్నారు. ఒకటో తరగతి నుంచి ప్రవేశానికి ఈనెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం రూ.8.05లక్షలు

కైకలూరు, ఫిబ్రవరి 22: కొల్లేటికోట పెద్దింట్లమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీల కానుకల మొక్కుబడుల ఆదాయం రూ.8,05,944 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు తెలిపారు. గురువారం గుడివాడ ఎండోమెంట్స్ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో 66 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పందిరిపల్లిగూడెం గ్రామస్థులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలు లెక్కింపు చేసినట్టు తెలిపారు.

160 మద్యం సీసాలు స్వాధీనం.. కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ

కైకలూరు, ఫిబ్రవరి 22: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. గురువారం కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. శృంగవరప్పాడు గ్రామానికి చెందిన బలే వెంకటేష్ అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో పలు బ్రాండ్లకు చెందిన 160 మద్యం సీసాలను ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. వీటి విలువ సుమారుగా రూ.33,200 ఉంటుందన్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు తెలిపారు.

దుగ్గిరాల రావమ్మ తిరునాళ్లు ప్రారంభం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22: మండలపరిధిలోని తోటపల్లి శివారులో వున్న దుగ్గిరాల రావమ్మ మాఘపౌర్ణమి తిరునాళ్ళు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ, మండపారాధన, అఖండ దీపారాధన, అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం పాతూరి వెంకటసుబ్బారావు దంపతులచే పల్లకిసేవ జరిగింది. శుక్రవారం రాత్రి తోటపల్లిలో భారీ ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వీరాంజనేయులు తెలిపారు.